బహదూర్‌పురాలో కాంగ్రెస్ ప్రచారం



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

బహదూర్‌పురా: హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీని గెలిపించాలంటూ అభ్యర్థి మహ్మద్ వలీ వుల్లా సమీర్ ఆదివారం బహదూర్‌పురా నియోజకవర్గంలో ఇంటింటా ప్రచారం న్వహించారు. బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పులిపాటి రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో దూద్‌బౌలి, ఉందాబజార్, కామటిపుర, మహారాజ్‌గంజ్ ప్రాంతాల్లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బహదూర్ పురా చార్మినార్, యాకుత్‌పురా, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు పులిపాటి రాజేష్‌కుమార్ ముజీబ్ వుల్లా షరీఫ్, రవిరాజ్, బహదూర్ పురా నియోజకవర్గం కో ఆర్డినేటర్ సంజయ్ యాదవ్, సీనియర్ నాయకులు దిలావర్ హుస్సేన్, అబేద్ అలీ, ఆస్కార్ అలీ, మూస ఖాసీం నాయకులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి శూన్యం

కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్



దానం నాగేందర్‌కు హారతి ఇస్తున్న మహిళలు



మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, ఫిరోజ్ ఖాన్

అబిడ్స్/గోల్కొండ: ఐదేళ్లలో బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి ఎంపీగా, కేంద్ర మంత్రిగా ఉండి కూడా సికింద్రాబాద్ పార్లమెంట్‌లో ఆయన చేసిన అభివృద్ధి శూన్యమని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలోని భోజగుట్ట, వివేకానందనగర్, మెహిదీపట్నం, ఆసిఫ్‌నగర్, మల్లేపల్లి, సీతారామ్‌బాగ్ ప్రాంతాల్లో రాష్ట్ర నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌తో కలిసి ఆయన ముమ్మర ప్రచారం చేశారు. భోజగుట్టలో ప్రచారం నిర్వహించి అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థిగా తనను గెలిపిస్తే ఆరు నెలల్లోపు భోజగుట్ట వాసులందరికీ ఇళ్ల పట్టాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. గతంలో నాంపల్లి నియోజకవర్గంలోని పలు బస్తీలు, మురికివాడల్లో, ఖైరతాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో వేలాది మందికి పట్టాలు ఇప్పించానని చెప్పారు. భోజగుట్టవాసులకు కూడా ఆరు నెలల్లోపు పట్టాలు ఇప్పించి ప్రభుత్వం నుంచి ఇళ్ల నిర్మాణానికి వచ్చే డబ్బులను కూడా ఇప్పిస్తానని పేర్కొన్నారు.

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మురిగినట్లే..

బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే మురిగినట్లేనని కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు అంతర్గతంగా ఒకటై ప్రజలను తప్పుతోవ పట్టించేందుకు ప్రయత్నిస్తున్నాయన్నారు. ప్రజలంతా ఒక్క ఓటు కూడా వేస్ట్ కాకుండా కాంగ్రెస్‌కు ఓటువేసి అభివృద్ధిని పొందాలన్నారు. తనను గెలిపిస్తే అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానన్నారు.

బీఆర్ఎస్‌కు డిపాజిట్ దక్కదు..

బీఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ దక్కదని దానం నాగేందర్ అన్నారు. బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే బీజేపీకి ఓటు వేసినట్లే నన్నారు. ప్రతి ఒక్క ఓటరు ఆలోచించి ఓటు వేయాలన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రగతి, సంక్షేమం, అభివృద్ధి చేపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి తనను గెలిపించాలన్నారు. ఐదేళ్ల పాటు ప్రజలకు అందుబాటులో లేని బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి ఓటు వేస్తే మరోసారి ప్రజలకే అన్యాయం జరుగుతుందన్నారు. ఎన్నికలప్పుడే కిషన్‌రెడ్డికి బస్తీలు, మురికి వాడలు గుర్తు వస్తాన్నాయని ఆయన ఎద్దేవ చేశారు.

దానంకు తగ్గని ప్రజా ఆదరణ..

గతంలో మూడు సార్లు ఆసిఫ్‌నగర్ నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా పనిచేసిన దానం నాగేందర్‌కు 15 ఏళ్ల అయిన తర్వాత కూడా ప్రజల్లో అదే ఆదరణ ఉంది. ఆదివారం పలు బస్తీలు, మురికి వాడలు, కాలనీల్లో ముమ్మరంగా పర్యటించిన దానం నాగేందర్‌కు వాడవాడల ప్రజలు నీరాజనం పలికారు. గతంలో నాగేందర్ చేసిన అభివృద్ధిని పలువురు కొనియాడుతూ గుర్తు చేసుకున్నారు. నాగేందర్‌ను గెలిపించుకుంటామని పలు ప్రాంతాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ నాయకులు ఫరీద్, అక్బర్‌అలీ షరీఫ్ సంతోష్‌గుప్తా, మమతా గుప్తా, శ్రీశైలం యాదవ్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కాంగ్రెస్‌దే విజయం



మాట్లాడుతున్న మహ్మద్ వలీ వుల్లా సమీర్

చార్మినార్: హైదరాబాద్‌లో తమ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహ్మద్ వలీ వుల్లా సమీర్ ధీమా వ్యక్తం చేశారు. శనివారం రాత్రి ఖిల్వత్ వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ..ఈ ఎన్నికల్లో తనకే ఓటు వేసి గెలిపించాలని కోరారు. అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్‌కు మద్దతు తెలియజేస్తున్నారన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న గ్యారంటీ పథకాలతో సంతృప్తి చెందుతున్న అన్ని వర్గాల ఓటర్లు తమ పార్టీకే ఓటు వేయనున్నారన్నారు. ఓవైపు మజ్లిస్ పార్టీ, మరోవైపు బీజేపీలు చేస్తున్న మత రాజకీయాలతో హైదరాబాద్ ఓటర్లు మండిపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ శాసన సభ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ముజీబ్ ఉల్లా షరీప్ పాల్గొన్నారు.

ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించుకోవాలి



శృతిని సన్మానిస్తున్న దినాస్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజ జీవన శైలీలో ప్రతి ఒక్కరూ ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ఆకాష్ జైన్ అన్నారు. ఆదివారం అబిడ్స్‌లోని ఇన్‌స్పైర్ మహిళల ఫిట్‌నెస్ కేంద్రంలో ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డ్యాన్స్‌తో ఫిట్‌నెస్ సాధ్యమవుతుందన్నారు. గిన్నిస్ వరల్డ్ రికార్డు గ్రహీత యోగా నిపుణురాలు దినాజ్ మాట్లాడుతూ..ప్రతి మహిళ యోగాను ఒక దిన చర్యగా చేసుకోవాలన్నారు. అనంతరం వేయిట్ లిఫ్టర్ శృతిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఫిట్‌నెస్ ట్రైనర్ సంగీత, ఇన్‌స్పైర్ నిర్వాహకుల డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి బీజేపీని గెలిపించండి



ప్రచార రథంపై మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్, అభ్యర్థి మాధవీలత

జియాగూడ: దేశంలో ప్రధాని నరేంద్రమోదీ పదేళ్లుగా చేసిన సంక్షేమం, అభివృద్ధిని చూసి ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని రాజస్తాన్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, యువజన క్రీడల శాఖ మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం హైదరాబాద్ లోక్‌సభ బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా జుమ్మెరాత్ బజార్‌లోని రాణి అవంతిబాయి చౌక్ నుంచి ప్రచార రథంపై చుడిబజార్, బేగంబజార్, సిద్దిఅంబర్‌బజార్ వరకు ఊరేగింపుగా ప్రచారం చేస్తూ బయల్దేరారు. అడుగడుగునా పూల వర్షంతో ప్రజలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి మాధవీలత మాట్లాడుతూ..తనపై పార్టీ అగ్ర నాయకత్వం ఉంచిన నమ్మకానికి అనుగుణంగా హైదరాబాద్‌లో అసదుద్దీన్ ఒవైసీని చిత్తుగా ఓడించి తీరుతానని స్పష్టం చేశారు. ఎంఐఎం గెలుపు కోసం కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంబీటీ పార్టీలు ఏకమై కృషి చేస్తున్నాయని అన్నారు. తన ప్రచారాన్ని అడ్డుకునేందుకు అడుగడుగునా అడ్డంకులు కల్పిస్తున్నారని అయినప్పటికీ ప్రజలు తనను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సమన్వ కర్త ప్రేమ్‌సింగ్ రాథోడ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్, బీజేపీ సీనియర్ నాయకులు శ్రీరామ్ వ్యాస్, లడ్డు యాదవ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల స్థలాల కబ్జాలపై విచారణ చేపట్టాలి

జియాగూడ: జియాగూడలోని కుల్సుంపురా 2జే బస్టాప్ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయ స్థలాన్ని కొంత మంది కబ్జాచేసి ప్రహరీ నిర్మాణం చేపట్టడానికి కృషి చేస్తున్నారని గోల్కొండ జిల్లా బీజేపీ డెయిరీ సెల్ కన్వీనర్, ఆలయ ప్రతినిధి శివకుమార్‌యాదవ్ ఆరోపించారు. ఈ మేరకు ఆసిఫ్‌నగర్ మండల కార్యాలయంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..జియాగూడలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం, ఏసుగుల బావి మాతేశ్వరీ మందిరం, కేశవ స్వామి మందిరాల స్థలాన్ని కబ్జాచేసి విక్రయించడానికి కూడా యత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేణుకా ఎల్లమ్మ ఆలయ స్థలం విషయంలో కోర్టులో కేసు నడుస్తున్నప్పటికీ ఆలయ స్థలాన్ని ఇటీవల చదునుచేసి ప్రహరీ నిర్మించడానికి కొంతమంది ప్రైవేటు వ్యక్తులు పూనుకోవడం బాధాకరమన్నారు. మండల సిబ్బంది వెంటనే ఆలయాల స్థలాలను సందర్శించి పరిరక్షించి భద్రత కల్పించాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



అబిడ్స్: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని లభ్యమై ఘటన అబిడ్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. బషీర్‌బాగ్ నిజాం, పీజీ కళాశాల వద్ద రోడ్డుపై ఓ వ్యక్తి(40–45) మృతదేహం ఉందని స్థానికుల సమాచారం అందించారు. పోలీసులు ఆ మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇతని ఆచూకి తెలిస్తే అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో తెలపాలని ఆయన సూచించారు.

అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలి



రెయిన్‌బజార్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్

యాకుత్‌పురా: యాకుత్‌పురా నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్ ఆదివారం ప్రచారం నిర్వహించారు. యాకుత్‌పురా లబైక్ హోటల్, రెయిన్ బజార్ చమన్, అన్‌మోల్ హోటల్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికీ తిరుగుతూ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి అసదుద్దీన్ ఒవైసీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాతబస్తీ ప్రజల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న తమ పార్టీ అధినేత అసదుద్దీన్ గెలుపును ఏ శక్తులు ఆపలేవన్నారు. ఈ కార్యక్రమంలో తలాబ్ చంచలం, రెయిన్ బజార్, పత్తర్‌గట్టి కార్పొరేటర్లు డాక్టర్ సమీనా బేగం, మహ్మద్ వసీవుద్దీన్, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మజ్లిస్ పార్టీ యాకుత్‌పురా ఇన్‌చార్జి యాసర్ అరాఫత్ పాల్గొన్నారు.

హైదరాబాద్ సీటు మాదే: ఎమ్మెల్యే కౌసర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: హైదరాబాద్ లోక్‌సభ సీటు మాదేనని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ యూసుఫ్ టెక్డీలో మజ్లిస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..హైదరాబాద్‌లో మజ్లిస్‌కు పోటీ ఇచ్చే పార్టీ ఏది లేదని ఉనికికి కాపాడుకోవడానికే పార్టీలు పోటీ చేస్తున్నాయన్నారు. గతంలో సైతం మజ్లిస్ పార్టీకి ఓటమి తప్పదంటూ మజ్లిస్ వ్యతిరేకులు ప్రచారం చేసి బంగపడ్డారని ఆయన అన్నారు. మజ్లిస్ పార్టీ పనితనాన్ని చూసిన వారే మజ్లిస్‌కు ఓటు వేస్తున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, నాయకులు అజీజ్‌ఖాన్ పటాన్, హారూన్‌ఫరాన్, ఎంజేపీ గౌస్‌భాయ్, ఎక్బాల్ తదితరులున్నారు.

ప్రజా సేవకే జీవితం అంకితం



శంకర్‌యాదవ్‌ను సత్కరించిన ధన్‌రాజ్ తదితరులు

అబిడ్స్: ప్రజా సేవకే జీవితం అంకితమని బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్ పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో మోదీ పథకాలతోనే బీజేపీ అధిక ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందన్నారు. మోదీ హయాంలోనే భారతదేశం ప్రపంచంలోనే నెంబర్:1 దేశంగా మారిందన్నారు. మజ్లిస్, బీఆర్ఎస్‌ల మాయ మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు అరిచేతుల్లో వైకుంఠం చూపించి ఓట్లు దండుకునే ప్రయత్నం చేస్తున్నారని శంకర్‌యాదవ్ ఆరోపించారు. ఈ సందర్భంగా శంకర్ యాదవ్‌ను ధన్‌రాజ్‌తో పాటు వనమాల గోపాల్ పలువురు నాయకులు ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పురస్కారాల ప్రదానం

గన్‌ఫౌండ్రీ: ఈనెల 29న వంశీ ఆర్ట్ థియేటర్స్, తిరుమల బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురు ప్రముఖులకు వంశీ తిరుమల బ్యాంకు ఉగాది కామధేను పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు తిరుమల బ్యాంక్ చైర్మన్ చంద్రశేఖర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వంద మంది విదేశీ, దేశ ప్రముఖులకు ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి భగవాన్ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్, తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సినీనటులు కోట శ్రీనివాసరావు, సుమన్, మురళీమోహన్, రోజారమణితో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు తెలిపారు. అమెరికా, సింగాపూర్, న్యూజిలాండ్, ఉగాండ దేశాల నుంచి కొంత మంది ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలియజేశారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ నృత్యోత్సవం సందర్భంగా ఆదివారం అభినయావని నృత్యానికేతన్ నాట్య గురువు చావళి బాల త్రిపురసుందరి శిష్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనను ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు. గణేశకౌతం, వందే మహేశ్వరం, వసంత స్వరజతి, నారాయణతే, రామాయణశబ్దం, భావయామి, తిల్లాన తదితర అంశాలను కళాకారులు సంజన, అనురిత, సహన, యజ్ఞ, ప్రియసిని, చైత్రహాసిని, సౌమ్య, సంయుక్త, శశికళ, వైష్ణవి, మృత్యుంజయశర్మ, సర్వాణిలు ప్రదర్శించి అలరించారు.

ఘనంగా సౌత్ ఇండియా ఐకాన్ అవార్డుల ప్రదానం

రాయదుర్గం: సౌత్ ఇండియా ఐకాన్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహసంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10 మందికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ-హబ్‌లో 'కమ్యూనిటీ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్స్', బ్లాగర్స్, ఇన్‌ఫ్లూయోన్సర్స్, యూట్యూబర్స్, న్యూ స్టార్టప్స్‌ల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. అంతర్జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా సోదరి ఆనమ్ మీర్జా ముఖ్య అతిథిగా హాజరై గిఫ్ట్ హ్యాంపర్లను పంపిణీ చేశారు. సాదియా కుర్షీద్, ప్రవీణ్, గుల్నర్ ఈవెంట్స్ ప్రతినిధి సుప్రియోచక్రబర్తి, బగ్గా, ఫుడ్‌బ్లాగర్ ఆయేషా జరీన్, ఖుక్కా నవాబ్, ట్రావెల్ బ్లాగర్ అమీర్ అహ్మద్, హీనాభాటియా, దస్‌పట్ రాజ్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కుపై అవగాహన



గచ్చిబౌలి: పోలింగ్ శాతం పెంపునకు అధికారులు చేసే ప్రయత్నానికి ఓటర్లంతా సహకరించాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని బయోడైవర్సిటీ పార్కు ప్రాంతంలోని మైహోమ్ భూజాలో స్వీప్, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓటుహక్కు ఉన్న వారంతా విధిగా తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు వేస్తేనే ప్రజాస్వామ్య లక్ష్యం నెరవేరుతుందన్నారు. నగరాల్లో ఓటింగ్ శాతం తగ్గుతుందనే ఆందోళన అందరిలోనూ వస్తుందని, దీనికి భిన్నంగా ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పోలింగ్ శాతం పెంచేందుకే అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. జీహెచ్‌సీయూ యూసీడీ అదనపు కమిషనర్ డాక్టర్ సీఎస్‌రాజు, ఫెసిలిటీ మేనేజర్ అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అధికారులు, గేటెడ్ కమ్యూనిటీవాసులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గ్రాడ్యుయేషన్ డే



సాక్షి, సిటీబ్యూరో: ప్రతి విద్యార్థి జీవితంలో గ్రాడ్యుయేషన్ ముఖ్యమైన మైలురాయి అని నారాయణ పాఠశాలల జోనల్ ఏజీఎం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గుడిమల్కాపూర్‌లోని నారాయణ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డేని ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఫర్హాన ముబిన్, కో ఆర్డినేటర్లు ఫర్జాన, రష్మిక, ఏవో లావణ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట



చార్మినార్-గుల్జార్‌హౌజ్ రోడ్డులో సందర్శకుల సందడి



కోటలో పర్యాటకులు

చార్మినార్: పాతబస్తీలో ఆదివారం సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాతబస్తీలోని పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. తమ కుటుంబసభ్యులతో కలిసి పాతబస్తీలోని చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూ పార్కు, నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. చిరు వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి.

కోటలో సందర్శకుల సందడి..

గోల్కొండ: మండే ఎండకు సైతం లెక్క చేయకుండా పర్యాటకులు గోల్కొండకు తరలివచ్చారు. ఉదయం 7 గంటలకే గోల్కొండ కోట ముందు కౌంటర్ వద్ద టికెట్ల కోసం క్యూ కట్టారు. కోటలోకి వచ్చిన పర్యాటకులు క్లాపింగ్ పోర్టికో వద్ద కొద్ది సేపు కూర్చొని సేదతీరారు. క్లాపింగ్ పోర్టికో వద్ద గల భారీ ఫిరంగిని చూసి పిల్లలు ఆ ఫిరంగిపై ఎక్కి సంబరపడ్డారు. అనంతరం అక్కడ ఉన్న జగదాంబిక మహంకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ విజయం ఖాయం



వలీ వుల్లా సమీర్‌ను సన్మానిస్తున్న కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: హైదరాబాద్ పార్లమెంట్ స్థానంతో పాటు తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని ఆ పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి వలీ వుల్లా సమీర్ అన్నారు. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన పలువురు సీనియర్ నాయకులు ఆదివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూలమాలలు వేసి సన్మానించారు. కార్వాన్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీకి అత్యధిక ఓట్లు వచ్చేలా కలిసికట్టుగా కృషి చేస్తామని ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ అన్నారు. అనంతరం వలీ వుల్లా సమీర్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన అతి కొద్ది కాలంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ఇచ్చిన వాగ్దానాలను దశల వారీగా పరిష్కరిస్తున్నారన్నారు. ఆయనను కలిసిన వారిలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, ఏ.చంద్రశేఖర్ తదితరులున్నారు.

అన్నదానం



నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రి దగ్గర రోగులు, రోగి సహయకులకు రెడీ టు సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇక్కడ సుమారు 400 మంది రోగులకు అన్నదానం చేసి ఆకలి తీర్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జకీర్ అలీ, విజయ భాస్కర్ నారాయణరెడ్డి హాజరయ్యారు. రోగులకు, రోగి సహాయకులకు భోజనాన్ని వడ్డించారు.

అధ్వానంగా పార్కులు



తుప్పపడుతున్న ఫిరంగి



ధ్వంసమైన నీటి పాత్ర

గోల్కొండ: గోల్కొండ, ఫతేదర్వాజ, జిన్సీబజార్‌లలోని పార్కులు అధ్వానంగా మారుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో పార్కులలోని వస్తువులు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. గోల్కొండ ఫతేదర్వాజ ప్రహరీని ఆనుకొని ఖాళీ ప్రదేశంలో గతంలో పార్కును ఏర్పాటు చేశారు. ఇందులో కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి రెండు ఫిరంగులు, ఒక పెద్ద సిమెంట్ నీటి పాత్ర ఏర్పాటు చేసి పచ్చని చెట్లను కూడా నాటారు. చుట్టూ ఇనుప పెన్సింగ్‌ను ఏర్పాటు చేశారు. అయితే పచ్చని మొక్కల పరిరక్షణకు నీటిని పోయడం మరిచారు. దీంతో పార్కులో పచ్చదనం ఎప్పుడో మాయమైంది. పార్కులో ఏర్పాటు చేసిన రెండు ఫిరంగులు కూడా నానాటికి అధ్వానంగా మారుతున్నాయి. నీటి తొట్టి కూడా శిథిలమైపోయింది. ప్రస్తుతం ఈ పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలు ఆడుకుంటున్నారు. మరోవైపు జిన్సీబజార్‌లో ఏర్పాటు చేసిన త్రికోణ పార్కు సైతం అధ్వానంగా తయారయ్యింది. పిల్లలు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన పరికరాలు ఒకొక్కటిగా పాడవుతు వస్తున్నాయి. పార్కుకు ఓవైపు చెత్తను డంపింగ్ చేస్తున్నారు. దీంతో సాయంత్రం పూట పార్కుకు వచ్చే వారికి దుర్గంధం వస్తుంది. పిల్లలకు వేసవి కాలం సెలవులు ఉండడంతో సాయంత్రం పార్కుకు వస్తారని పార్కులను శుభ్రం చేసి పిల్లలకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాలతోనే గుర్తింపు



అసోసియేషన్ ప్రతినిధులతో టీఎఫ్‌సీఓ చైర్మన్ నజీబ్

గోల్కొండ: సేవా కార్యక్రమాలతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. ఆదివారం ఆయన టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్‌లో యువజన సంఘాలు, టీఎఫ్‌సీఓ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు నిర్వహించడం వల్ల యువకుల్లో ఆత్మస్థైర్యం పెరగడమే కాకుండా నాయకత్వ లక్షణాలు కూడా పెంపొందుతాయన్నారు. అంతేకాకుండా స్థానికంగా సైతం సేవా కార్యక్రమాలు నిర్వహించే వారికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఖాలేద్ అలీఖాన్, ముజీబ్, అబ్దుల్ సలాం ఉన్నారు.

వాసవీమాత విగ్రహానికి పూజ

మణికొండ: వాసవీ క్లబ్ కపుల్స్ మణికొండ వారి ఆధ్వర్యంలో ఆదివారం వాసవీ మాత నూతన పంచలోహ విగ్రహానికి ఆదివాస పూజ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని అలకాపూర్ తుల్జారాంభాగ్ దేవాలయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు వి.వంశీకృష్ణ మాట్లాడుతూ.. ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత అని ఆమెను పూజించటం నిత్య కార్యక్రమంలో భాగంగా ఉంటుందన్నారు. ఆమె విగ్రహాన్ని నూతనంగా ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో దేవాలయానికి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో యశ్వంత్, శిరీష, నిరీష, నవీన్‌కుమార్, రామ్‌సురేష్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.